క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



ఎస్ఐ నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని, పల్లె ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. శనివారం ఆయన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో దివ్యాంగుల సంఘం నాయకులు నూతన ఎస్ఐను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ బాలాజీ దివ్యాంగుల మండల సమాఖ్య సభ్యులు వేపులపర్తి చన్నమల్ల, నరసింహులు , హనుమంతు, చిత్తయ్య, వన్నూరు స్వామి, సుధాకర్, అంజి, మహిళా అధ్యక్షురాలు రాధమ్మ పాల్గొన్నారు.

బసంపల్లిలో తాగునీటి సమస్య

శెట్టూరు: మండలంలోని బసంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. మూడు రోజులుగా తాగునీటి పథకం మోటారు కాలిపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని పొలాల నుంచి నీరు తెచ్చుకునే పరిస్థితి తలెత్తింది. మరమ్మతులు చేసి, నీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గర్భిణులకు భోజన సౌకర్యం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు రాకెట్ల పీహెచ్‌సీ స్టాఫ్ నర్సు సునీత వందమందికి శనివారం భోజన సౌకర్యం కల్పించింది. పీహెచ్‌సీ వైద్యాధికారిణి పావని, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీల చేతుల మీదుగా గర్భిణులకు భోజనాన్ని అందించారు. డాక్టర్ పావని మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు లోను కాకుండా మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులు ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని గోళ్ల గ్రామంలో వాటర్ షెడ్ పనులను స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం ప్రారంభించారు. వాటర్ షెడ్ పథకం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పనులకు మంజూరయ్యాయి. ఫారంపాండ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, వాటర్ షెడ్ అధికారులు సుధాకర్, శ్రీవిద్య పాల్గొన్నారు.

కేన్సర్ సర్వే పక్కాగా చేపట్టండి



కేన్సర్‌పై తెలియజేస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

కూడేరు: మండలంలో ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే కేన్సర్ సర్వేను పక్కాగా చేపట్టాలని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో కేన్సర్‌పై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నోటి, మెడ, రొమ్ము, గర్భాశయ కేన్సర్లు – వాటి లక్షణాలపై వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలియజేశారు. కేన్సర్ ప్రమాదకరమైందన్నారు. కేన్సర్ రకాలు, వాటి లక్షణాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, ఎంఎల్‌హెచ్‌పీలు కరిష్మా, జయమ్మ, షిరీన్, రేష్మ, చంద్రకళ, శ్రీవిద్య, రాణి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించండి

వజ్రకరూరు: ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి కేన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి సర్దార్‌వలి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఏర్పాటు చేశారు. వైద్యాధికారి తేజశ్వి, ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీలమ్మ పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



వికసించిన బ్రహ్మకమలం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జీఆర్ఎస్ కాలనీలో నివాసం ఉంటున్న పూజారి తిరుమలేశు, ధనలక్ష్మీ దంపతుల ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. శనివారం తెల్లవారుజామున బ్రహ్మకమలం మొక్కకు మూడు పుష్పాలు వికసించినట్లు తెలిపారు. ఏడాదిన్నర క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గం నుంచి బ్రహ్మకమలం మొక్క తెచ్చినట్లు తిరుమలేశు దంపతులు తెలిపారు.

కష్టాలు దాటించే దారే లేదా..!

- భారీ వర్షాలు, వరదలకు కల్వర్టులు, రోడ్లు ధ్వంసం
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- పొరుగు గ్రామాలకు వెళ్లాలంటే 35 కిలోమీటర్లు చుట్టేయాల్సిందే..



కోతకు గురైన కల్లుదేవనహళ్లి-బండూరు రోడ్డు



దెబ్బతిన్న సింగానహళ్లికి వెళ్లే రోడ్డు

బొమ్మనహాళ్: అనుకోని విపత్తు పల్లె జీవనాన్ని అంధకారం చేసింది. వేదావతి హగరి ఆయా గ్రామాల ప్రజలకు తీరని కష్టాలు తెచ్చి పెట్టింది. ముప్ఫై ఏళ్లలో ఎన్నడూలేని విధంగా ఉప్పొంగింది. పరీవాహక గ్రామాల్లో పచ్చని పంటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు, వరదకు రోడ్లు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. పొలాల వద్దకు, పొరుగు గ్రామాలకు వెళ్లాలన్నా.. 35 కిలోమీటర్లు చుట్టేయాల్సి వస్తోంది. ఈ కష్టాలు దాటించే దారేలేదా? అని పల్లె జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొమ్మనహాళ్ మండలంలోని కల్లుదేవనహళ్లి, సింగానహళ్లి, బండూరు గ్రామాలకు రోడ్డు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో దర్గాహొన్నూరు, గోవిందవాడ, బొల్లనగుడ్డం, కల్లుహోళ, తారకాపురం, వన్నళ్లి, హోసళ్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించలేకపోతున్నారు. అత్యవసర పరిస్థితిలో వెళ్లాంటే దాదాపు 35 కిలోమీటర్లు మేర చుట్టేసుకుని వెళ్లాల్సి వస్తోంది. వైద్యం కోసం వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. బండూరు, దేవగిరి, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, హరేసముద్రం గ్రామాల ప్రజలు ఉరవకొండ, గుంతకల్లు, అనంతపురం, పాల్తూరు, విడపనకల్లు ప్రాంతాలకు వెళ్లాలంటే బళ్లారికి వెళ్లి అక్కడి నుంచి చేరుకోవాల్సిన పరిస్థితి. ఇక రైతులు , వ్యవసాయ కూలీలు పంట పొలాలకు వాగులో నడిచి వెళ్లాల్సి వస్తోంది. అధికార ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

స్తంభాలు, నియంత్రికలు ఇంకా నేలపైనే..

గత అక్టోబర్‌లో వేదావతి హగరి ఉధృతంగా ప్రవహించడంతో బొమ్మనహాళ్ మండలంలోని మైలాపురం వద్ద విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు కూలిపోయాయి. నీటి ప్రవాహం తగ్గకపోవడంతో మరమ్మతులకు వీలులేని పరిస్థితి. మొత్తం 8 నియంత్రికలు, 25 స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీటి తడులు ఇవ్వడం కష్టంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హగరిలో పైపులైన్లు వేసి కొలగానహళ్లి, మైలాపురం, లింగదహాళ్, ఉద్దేహాళ్, బండూరు, కల్లుదేవనహళ్లి, శింగానహళ్లి, బొల్లనగుడ్డం, గోవిందవాడ, హరేసముద్రం తదితర గ్రామాలకు నీరు అందిస్తున్నారు. ప్రవాహం దాటికి బోర్లకు అమర్చిన విద్యుత్ నియంత్రికలు, స్తంభాలు, పైపులైన్లు చాలా గ్రామాల్లో కొట్టుకుపోయాయి. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పైప్‌లైన్లు సైతం దెబ్బతినడంతో తాగునీరు సక్రమంగా అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు కోతకు గురికావడంతో వాగులో నడిచి వెళ్తున్న దృశ్యం



వరద ఉధృతికి కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అధికారులు ఏమంటున్నారంటే...

బొమ్మనహాళ్ మండలంలోని కల్లుదేవనహళ్లి వద్ద వేదావతి హగరికి వరద పోటెత్తింది. ప్రవాహం దాటికి రూ.1.20 కోట్లతో నిర్మించిన రోడ్డు కొట్టుకుపోయిందని ఆర్అండ్‌బీ ఈఈ జే. ప్రసాద్‌రెడ్డి, డీఈఈ రవిశంకర్‌రెడ్డి అన్నారు. తాత్కాలికంగా కల్వర్టులు, గుంతను పూడ్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అందుకు రూ. 35 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే తాత్కాలిక పనులు ప్రారంభిస్తామన్నారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు పునరుద్ధరణకు చర్యలు తీసకుంటామని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరెడ్డి తెలిపారు.

తాత్కాలిక మరమ్మతులు చేయాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదతో కల్లుదేవనహళ్లి వద్ద కల్వర్టు, రోడ్డు కొట్టుకుపోయింది. మండల కేంద్రానికి, చుట్టూ పక్కన గ్రామాలకు, పొలాలకు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. రోడ్డు కోతకు గురి కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారు. వాగులోనే నడుచుకుంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. అధికారులు కనీసం తాత్కాలిక పనులు కూడా చేపట్టలేకపోతున్నారు. ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి అయిన అధికారులు వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టి రాకపోకలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

– కందేపల్లి రమేష్, వైస్ ఎంపీపీ

ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాలి..



వరద ఉధృతికి రోడ్డు, కల్వర్టు కొట్టుకుపోవడంతో గ్రామాల దగ్గర పొలాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి ఉంది. వాగులో దిగి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. తమ ఇబ్బందులను గుర్తించి అధికారులు వెంటనే కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలి.

– హరిజన ఆంజనేయులు, కల్లుదేవనహళ్లి గ్రామం

35 కిలోమీటర్లు చుట్టేయాల్సిన పరిస్థితి..



మండల కేంద్రానికి వెళ్లాంటే కర్ణాటకలోని రూపనగుడికి వెళ్లి 35 కిలోమీటర్లు మేర చుట్టేసుకుని వెళ్లాలి. నిత్యం తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలకు వివిధ పనులు కోసం, వైద్య కోసం వెళ్తుంటాం. రోడ్డుకు కోతకు గురికావడంతో ఇటు వెళ్లలేక పనులు వాయిదా వేసుకుంటున్నాం.

– జంబునాథ్, తాకరాపురం గ్రామం

కౌలు రైతుల సమస్యలపై చిత్తశుద్ధిలేదు

ఉరవకొండ: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, అధికారం చేపట్టి ఐదు నెలలవుతున్నా రైతాంగ సమస్యలను ఒక్కటీ పరిష్కరించలేపోయారని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దముష్టూరు వెంకటేశ్, కార్యదర్శి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 12న విజయవాడలో సీపీఐ, సీపీఎం అనుబంధ సంఘాలతో పాటు దాదాపు 500 సంఘాలు కలిసి కౌలు రైతు సమస్యలపై భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ, పంటల సాగుకు పెట్టుబడి సహాయం, కౌలు రైతులు సాగు చేస్తున్న భూములపై బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలనే ప్రధాన డిమాండ్లతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

11 నెలలకు మృతుడి ఆచూకీ లభ్యం



నాగరాజు (ఫైల్)

ధర్మవరం అర్బన్: రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీని 11 నెలల తర్వాత కనుగొన్నారు. వేలిముద్రల ఆధారంగా వివరాలు కనుగొన్నారు. హిందూపురం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2023 డిసెంబర్ 28న ధర్మవరంలోని డీఎల్ఆర్ కాలనీ సమీపంలో రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వేలిముద్రల నివేదిక ఈ నెల ఎనిమిదో తేదీన రైల్వే పోలీసులకు అందింది. ఆ వేలి ముద్రలతో పోలీసు రికార్డుల్లో పరిశీలించి మృతుడు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన ఆకుతోట నాగరాజు(38)గా అంచనాకు వచ్చారు. తల్లి రామాంజినమ్మ, తమ్ముడు రామచంద్రను శనివారం రైల్వే స్టేషన్‌కు పిలిపించి మృతుని ఫొటోలు చూపించగా నాగరాజును గుర్తుపట్టారు. ఇతడు కళ్యాణదుర్గంలో 2008లో ఓ హత్య కేసులో శిక్ష అనుభవించాడు. జైలు నుంచి బయటకు వచ్చాక ధర్మవరంలో బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవాడు. నాగరాజు కుమారుడు ఆంజనేయులు 2022లో జంగాలపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకిందపడి మృతి చెందాడు. అప్పటి నుంచి ఒంటరి జీవితం భరించలేక మనోవేదనతో నాగరాజు కూడా రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

16న మండల సర్వసభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

కళ్యాణదుర్గం రూరల్: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ధర్నా చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ రెండు నాలుకల ధోరణిని తప్పుపట్టారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.2.08 లక్షలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీసాయి నాథ ఆలయంలో శనివారం హుండీ కానుకలను లెక్కించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ, ముఖ్య సభ్యుడు బండి కిష్టప్ప ఆధ్వర్యంలో భక్తులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 8 నెలలకుగాను రూ.2,08,190 హుండీ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సాయి భజన మండలి సభ్యులు, లక్ష్మీనారాయణ హమాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పశుగణన వివరాలు సమగ్రంగా సేకరించండి

బొమ్మనహాళ్: మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న 21వ అఖిల భారత పశుగణన వివరాలను సమగ్రంగా చేపట్టాలని పశువైద్య కేంద్రం వైద్యాధికారి రమేష్ తెలిపారు. శనివారం నరసాపురం, ఎర్రగుడి, శీర్పి గ్రామాల్లో కొనసాగుతున్న పశుగణన సర్వేను పశు వైద్యాధికారి తనిఖీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు ఎర్రిస్వామి, సుదర్శన్ పాల్గొన్నారు.

దాబాల్లో మద్యం అనుమతిస్తే చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిసర ప్రాంతాల్లోని దాబాల్లో మద్యం అనుమతిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ రవిబాబు, సీఐ వెంకటరమణ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో దాబా యజమానులతో సమావేశం నిర్వహించారు. దాబాల్లో మద్యం సేవించడం గాని, అనుమతించడం సరికాదన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు పోరాటం చేస్తాం

ఉరవకొండ: కేంద్ర కమిటీ ఆదేశాలను పాటిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ అమలుకు పోరాడతామని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ మీనుగ గోపాల్ అన్నారు. శనివారం ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్‌గా గోపాల్‌ను నియమిస్తూ దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మామిడి సుదర్శన్ ఉత్తర్వులు అందించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కంబదూరు: రాళ్లఅనంతపురం గ్రామంలో ఎక్సైజ్ సీఐ సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. గుట్టుగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న సాకే ముత్యాలప్పను పట్టుకొని, అతని నుంచి 29 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచి విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను అనంతపురం ఎన్ఫోర్ మెంట్ టీం ఆధ్వర్యంలో శనివారం స్వాధీనం చేసుకున్నారు. మల్లి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని నుంచి 30 డీపీఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

నాటు సారా స్థావరంపై పోలీసుల దాడి

బొమ్మనహాళ్: మండలంలోని బూదివర్తి గ్రామ శివారులోని ముళ్ల పొదల చాటున నిర్వహిస్తున్న నాటు సారా స్థావరంపై ఎస్ఐ శివ నేతృత్వంలో పోలీసులు శనివారం దాడులు చేశారు. దాడుల్లో నాటుసారా తయారీకి వినియోగించే సుమారు 400 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు.

సమస్యలు పరిష్కరించండి

రాయదుర్గంటౌన్: శివారులోని గొడ ఇందిరమ్మ లేఅవుట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున అన్నారు. శనివారం కాలనీలో పర్యటించి, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ సరఫరా లేక కొట్టుమిట్టాడుతున్నట్లు చెప్పారు. వర్షాలకు మట్టి రోడ్లన్నీ కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు సమస్యలు తెలియజేశారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు స్పందన



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు, ఈడీటీ సుజాత



పోలింగ్ బూత్‌ల వద్ద ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

రాయదుర్గంటౌన్:నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సుజాత కోరారు. తొలిరోజు శనివారం మండలంలోని 74 ఉడేగోళం, బీఎన్ హళ్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదును అధికారులు పరిశీలించారు.

169 క్లయిమ్‌ల స్వీకరణ : తొలి శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో నియోజకవర్గంలోని రాయదుర్గం పట్టణం, రూరల్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల నుంచి 169 క్లయిమ్‌లు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు, ఈడీటీ సుజాత తెలిపారు. వీటిలో కొత్త ఓటరు నమోదుకు (ఫారం-6) 102 క్లయిమ్‌లు, తొలగింపులకు (ఫారం-7) 27, మార్పులకు 41 క్లయిమ్‌లు (ఫారం-8) స్వీకరించినట్లు చెప్పారు.

కళ్యాణదుర్గం: ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ఆర్డీఓ వసంత బాబు ఆదేశించారు. ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా శనివారం పట్టణంలో 56,57,58,59,60 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు ఓటర్ల నుంచి వచ్చిన క్లెయిమ్‌లను పరిశీలించారు. ఆదివారం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని బీఎల్వోలు ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. ఎన్నికల సహాయకులు శ్రీనివాసులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

కంబదూరు: జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ శనివారం తెలిపారు. ఈనెల 9,10వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఆయా పోలింగ్ బూత్‌ల ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఓటు తొలగింపునకు ఫారం-7, వివరాల మార్పునకు ఫారం-8 దరఖాస్తులను కూడా స్వీకరిస్తామన్నారు. సీనియర్ అసిస్టెంట్ పెద్దన్న, వీఆర్వో సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవాలు

బొమ్మనహాళ్: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం నుంచి కేరళ తాంత్రిక నిపుణులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ట హోమాలు జరుగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఈనెల 10 నుంచి 13 వరకు కేరళ బ్రహ్మర్షి ఆధ్వర్యంలో హోమాలు కొనసాగుతాయి. ఆదివారం మహాగణపతి హోమం, వాస్తు హోమాలు, సోమవారం మృత్యుంజయ, లక్ష్మీవినాయక, మహాసుదర్శన హోమాలు, మంగళవారం కర్మ విమోజన హోమం, సరస్వతి పూజ, కాళీపూజ, బుధవారం గణపతి హోమం అనంతరం ఉదయం 9 గంటల నుంచి 10.45 గంటల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ట అనంతరం 12 గంటలకు మహామంగళహారతి పూజలు ముగుస్తాయన్నారు.

'ప్రశ్నించే గొంతుపై కక్షసాధింపు సరికాదు'

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై కక్ష సాధింపు సరికాదని సోషల్ మీడియా ఆర్గనైజర్ కాశీరాం నాయక్ అన్నారు. శనివారం పట్టణంలో కాశీరం నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం కక్ష సాధింపులు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలోని హామీలను అమలు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలను మోసం చేస్తున్నారని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు, అరెస్టులు చేస్తూ గొంతునొక్కడం ఎంతమాత్రమూ సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైన ధ్యాస పెట్టాలని, వైఫల్యాలపై ప్రశ్నిస్తే కక్షసాధింపులకు పాల్పడం సరికాదన్నారు.

జల్లిపల్లిలో సీతారాములకు ప్రత్యేక పూజలు



జల్లిపల్లిలో అలంకరణలో ఉన్న సీతారాములు

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలోని రామాలయంలో శనివారం సీతారాముల దేవతామూర్తులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పూజల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేమకల్లు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



లక్ష తులసీ అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక పూ జలు చేశారు. లక్ష తులసీమాల అలంకరణలో భక్తులకు నేమకల్లు ఆంజనేయస్వామి దర్శనం ఇచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో స్వామికి పవిత్ర గంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.

సీతారామస్వామి ఆలయంలో విశేష పూజలు

వజ్రకరూరు: స్థానిక బలిజ వీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అర్చనలు, విశేషపూజలు, మంగళహారతి,తీర్థప్రసాద వినియోగం చేశారు. జనార్దన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

శివాలయాల్లో కార్తీక మాస పూజలు



అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరస్వామి



పూజలందుకున్న నగరేశ్వరస్వామి

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం కార్తీకమాస పూజలు నిర్వహించారు. నగరేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జరుట్లరాంపురం గ్రామంలో దక్షిణకాశీగా పిలువబడుతున్న జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు నిర్వహించారు. కొనకొండ్లలోని ఛాయామల్లేశ్వర స్వామి ఆలయంలోనూ కార్తీక పూజలు నిర్వహించారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

కంబదూరు: ఎగువపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రామాంజనేయులు శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పే స్వామి శనివారం గ్రామానికి వెళ్లి రామాంజనే యులు మృత దేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రంపల్లి కృష్ణమూర్తి, విద్యార్థి విభాగం రాష్ట కార్యదర్శి షేక్షావలి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

కణేకల్లు: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ శంకర్ రెడ్డి కథనం మేరకు... కణేకల్లులోని పాత పోలీసు స్టేషన్ ప్రాంతంలో నివాసముంటున్న మీనాక్షమ్మ తన కూతురు లక్ష్మిని నంద్యాల జిల్లా పాపిలి మండలం కర్లచెర్లకు చెందిన పెద్దయ్యకిచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేసింది. రూ.90వేల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలను కట్నం కింద ఇచ్చింది. మూడేళ్లపాటు వీరి కాపురం సవ్యంగా సాగింది. అనంతరం పెద్దయ్యకు డబ్బు అవసరం రావడంతో పుట్టింటికెళ్లి తీసుకురావాలంటూ భార్యను వేధించడం ప్రారంభించాడు. అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో ఆ బాధను భరించలేని లక్ష్మి శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.